క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల పరిధిలోని తేలకంటిగూడెం గ్రామానికి చెందిన నామ అంజయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు గురువారం పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన గుండమల్ల ఆనంద్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గాయాలు కాగా రూ.5000 అందజేశారు. సర్పంచ్ బొగరి రాంబాబు, వెంకట్‌రెడ్డి, రామస్వామి, నామ శ్రీకాంత్, ఆనంద్, ప్రకాష్, గోపాల్, మనోహర్ తదితరులు ఉన్నారు.

మునుగోడు : మండల కేంద్రానికి చెందిన ఈద మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలమల్ల కృష్ణారెడ్డి పంపిన రూ.10వేల నగదును గురువారం స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్, పాల్వాయి చెన్నారెడ్డి, దినేష్, కాటం వెంకన్న, మహేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన

మర్రిగూడ : మండలంలోని కమ్మగూడలో ఉపాధిహామీ నిధుల ద్వారా చర్చి, సెయింట్ జోసఫ్ హైస్కూల్, సెయింట్ థెరిస్సా పాఠశాలల్లో ఇంకుడు గుంతల నిర్మాణానికి దామెర భీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణు గురువారం శంకుస్థాపన చేశారు. ఏపీఓ గుంటుక వెంకటేశం, చర్చి ఫాదర్ చిన్నయ్య, మరియానంద్, ఫీల్డ్ అసిస్టెంట్ జహంగీర్, ఇటుకులపాటి సైలు, విజయచందర్, స్టైఫన్, కవిత, శ్రీకాంత్, వినోద్, కిరీటయ్య పాల్గొన్నారు.

టీ-9 టికెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నార్కట్‌పల్లి : ఆర్టీసీ ప్రవేశపెట్టిన టీ-9 టికెట్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని నార్కట్‌పల్లి డిపో మేనేజర్ వెంకటమ్మ కోరారు. గురువారం స్థానికంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. టీ-9(30) ద్వారా 50 రూపాయలకే 30 కిలోమీటర్లు అప్ అండ్ డౌన్ ప్రయాణం చేయవచ్చన్నారు. ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు టికెట్ ఉపయోగపడుతుందన్నారు. టీ-9 టికెట్ 60 కిలో మీటర్లు 100 రూపాయలు కాగా టీ-30 టికెట్ ద్వారా 30 కిలోమీటర్ల వరకు అప్ అండ్ డౌన్ ప్రయాణం చేయవచ్చన్నారు.

సమగ్ర విద్యయే ఎన్ఈపీ ధ్యేయం

రామగిరి(నల్లగొండ) : సమగ్ర విద్య అందరు నేర్చుకోవడం నూతన జాతీయ విద్యా విధానం ధ్యేయమని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ టి. సామ్రాజ్యలక్ష్మి అన్నారు. భారత ప్రభుత్వం కేంద్రీయ విద్యాలయాల్లో నూతన విద్యా విధానం ప్రవేశపెట్టి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం నల్లగొండ కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన వార్షికోత్సవ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్‌వీఎస్ తిరుమలగిరి ప్రిన్సిపాల్ కె. చంద్రశేఖర్, నల్లగొండ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జి. పార్థసారథి, ఎంజీ యూనివర్సిటీ అసిస్టెంటు ప్రొఫెసర్ కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన 'భగీరథ' కార్మికుల సమ్మె

నల్లగొండ : తమకు వేతనాలు పెంచడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తు జిల్లా కేంద్రంలోని పానగల్ మిషన్ భగీరథ ఎస్ఈ కార్యాలయం ఎదుట జిల్లా వ్యాప్తంగా మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమకు 60 జీఓ ప్రకారం వేతనాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. జెంజిరాల శ్రీను, బత్తుల వెంకటేశం, నిమ్మనగోటి శ్రీను, రాజయ్య, నందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా సిరిపంగి శ్రీనివాస్

మర్రిగూడ : కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిపంగి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ ఆదిమళ్ల శంకర్ గురువారం శ్రీనివాస్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కురుపాటి గణేశ్, కొత్తపల్లి మధు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీలు అందజేత

నకిరేకల్ : మండలంలోని నోముల గ్రామానికి చెందిన ఆళ్లగడప అలివేలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరింది. ఆమెకు అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీ, నకిరేకల్‌లోని 20వ వార్డుకు చెందిన బెజవాడ నిహారికకు రూ.1.50 లక్షల ఎల్ఓసీని గురువారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, చెవుగోని సైదులుగౌడ్ తదితరులు ఉన్నారు.



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

తరుగుతున్న అటవీ సంపద !

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు

మర్రిగూడ : మండలంలో అటవీశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా దళారుల దందా ఇష్టానుసారంగా సాగుతుండడంతో అటవీ సంపద అన్యాక్రాంతమవుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా దాదాపు 2వేల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉంది. అటవీ ప్రాంతం అక్కడక్కడ ఆక్రమణలకు గురవుతుండడం, చెట్లను నరికివేయడంతో అటవీ సంపద తగ్గిపోతోంది. దీంతో నెమళ్లు, కోతులు, అడవి పందులు ఆహారం కోసం రైతులు సాగు చేస్తున్న పంటలను నాశనం చేస్తున్నాయి. గ్రామాల్లోకి వచ్చిన నెమళ్లు, జింకలపై ఇటీవల కుక్కలు దాడి చేయడంతో అవి మృత్యువాత పడ్డాయి.

లారీల ద్వారా కలప తరలింపు

అటవీ పరిధిలో ఎవరైనా చెట్లను నరికివేయాల్సి వస్తే ప్రభుత్వ అనుమతి కోసం మీసేవ లో చలానా తీయాల్సి ఉంటుంది. అయితే కొందరు అదే చలానాను కలపను తరలించేందుకు కూడా వే బిల్లులాగా ఉపయోగిస్తున్నారు. అడవిలో నరికివేసిన కలపను వ్యాపారులు లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా కొద్దిపాటి కలపకు అనుమతి పొంది అధిక మొత్తంలో కలప నరికివేసి సొమ్ము చేసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

బొగ్గు బట్టీలతో అనారోగ్యం..

శివన్నగూడ, కమ్మగూడ గ్రామాల్లో బొగ్గు బట్టీలు ఉన్నాయి. ఈ బొగ్గులను హైదరాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాలకు వ్యాపారులు తరలిస్తుంటారు. బట్టీల్లో కలపను కాలుస్తున్న సమయంలో దట్టమైన పొగలు వెలువడుతున్నాయని దీంతో తమ ఆరోగ్యం దెబ్బతింటోందని సమీప గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అక్రమాలను అడ్డుకట్టి ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూడాలని, అదేవిధంగా అటవీ సంపదను పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.



శివన్నగూడలో బొగ్గు బట్టీ



ట్రాక్టర్‌లో తరలిస్తున్న వేప కలప

పంట పొలాల్లోకి జింకలు వస్తున్నాయి



మా గ్రామంలో ప్రతి ఏడాది పత్తి పంటలోకి జింకలు వచ్చి పంటకు నష్టం కలుగజేస్తున్నాయి. కొన్ని జింకలు మృత్యువాత పడుతున్నాయి. వాటికి రక్షణ కల్పించి రైతులు నష్టపోకుండా చర్యలు చేపట్టాలి.

– ఎర్ర రాజుయాదవ్, సరంపేట

చెట్ల నరికివేతను అరికట్టాలి



అటవీ సంపద, వృక్షాలను ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పరిరక్షించుకోవాలి. చెట్ల నరికివేతను అరికట్టేందుకు అధికారులు చొరవ చూపాలి. చెట్లను నరకాల్సి వస్తే ప్రభుత్వ ఆదేశాల మేరకు అనుమతులు తప్పనిసరిగా పొందాలి.

– సుంకరి మల్లేష్‌గౌడ్, శివన్నగూడ

అనుమతులు తప్పనిసరి

చెట్లను నరకాల్సి వస్తే మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాల్సి ఉంటుంది. వన్యప్రాణుల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అక్రమంగా చెట్లను నరికినా కలపను తరలించినా చట్టపరమైన చర్యలు తప్పవు.

– రవీందర్, సెక్షన్ ఆఫీసర్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ టూటౌన్ : భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ ఉద్యోగులందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు మెప్మా ఆర్పీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, శిథిలావస్థలో భవనాలు ఉంటే పట్టణ ప్రణాళిక అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఏదైనా సమస్య వస్తే మున్సిపాలిటీ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఏసీపీ నాగిరెడ్డి, డీఈ వెంకన్న, ఏఈ రవీందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, ప్రదీప్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్, సురిగి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండ టూటౌన్ : మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణాచారి

గ్రామస్థాయి అధికారుల సమావేశం

నార్కట్‌పల్లి : భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో డబుల్ రోడ్డు పనులు జరుగుతున్నందున వాహనదారులు తగు చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పులి సైదులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రదీప్, ఎంపీఓ సత్యనారాయణ, ఏపీఓ యాదగిరి తదితరులు ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

కేతేపల్లి : విస్తారంగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కేతేపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాగులు, కాల్వలు దాటే ప్రయత్నం చేయకూడదన్నారు. చెట్ల కింద, శిథిలావస్థకు చేరిన భవనాల్లో ఉండవద్దని సూచించారు. రోడ్డు వెంట ఉండే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ముట్టుకోవద్దని కోరారు. వర్షాలు కురుస్తున్న సమయంలో రైతులు విద్యుత్ మోటార్లను ఆన్ చేయవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 నంబర్‌కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఇతర ప్రాంతాలకు తరలించాలి

కనగల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మిద్దె ఇళ్లు, పూరి గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను సర్పంచ్‌లు గుర్తించి ప్రజలను ఆవాసయోగ్యమైన ప్రదేశాలకు తరలించాలని కనగల్ ఎస్ఐ నర్రా అంతిరెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే వెంటనే తహసీల్దార్‌కు, పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 8712670184 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉచిత విద్య అమలు చేయాలి



తిప్పర్తిలో సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్ : కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అమలు చేయాలని, సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర ముగింపు సందర్భంగా నల్లగొండలో గురువారం ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్, లక్ష్మణ్, రేణుక, సైదా, వెంకటేశ్, రమేష్, జగన్, వీరన్న, సంపత్, రవి,తరుణ్, సాయి,చందు, శ్రావన్, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

జీసీడీఓను సస్పెండ్ చేయాలి

రామగిరి(నల్లగొండ) : కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల జిల్లా అధికారి (జీసీడీఓ)ని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర గురువారం తిప్పర్తి మండల కేంద్రానికి చేరుకుంది. సైకిల్ యాత్రకు సీపీఎం నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాడుగులపల్లి మండలంలోని కేజీబీవీ నూతన భవనాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కుర్రా సైదానాయక్, లక్ష్మణ్, వెంకటేష్, జగన్‌నాయక్, సాయిచందు, స్వామి, తరుణ్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



కట్టంగూర్‌లో పీర్ల ఊరేగింపు



మర్రిగూడ : పీర్లను ఊరేగిస్తున్న నిర్వాహకులు

కట్టంగూర్ : మండలంలోని బొల్లేపల్లి, ఈదులూరు, పిట్టంపల్లి, ఎరసానిగూడెం, కట్టంగూర్ గ్రామాల్లో గురువారం పీర్లను ఊరేగించారు. భక్తులు కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మర్రిగూడ : మండలంలో పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని రాంరెడ్డిపల్లిలో పీర్లను ఊరేగించారు. భక్తులు పీర్లకు దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బండి హనుమంతు, ఎండీ.గౌస్, సలీం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను క్రమబద్ధీకరించాలి

నల్లగొండ టౌన్ : గ్రామపంచాయతీ కార్మికులందరినీ ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, ప్రజాస్వామ్య ఫోరం జిల్లా కన్వీనర్ చొల్లేటి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు కత్తుల షణ్ముఖ, ఎర్ర సైదులు, పి.వెంకులు, కర్షిద్ మియా, పందుల సైదులు, ఇందూరు సాగర్, భిక్షపతి, ప్రభావతి, రవీందర్, అరుణ, ఉమారాణి, గంజి మురళీధర్, నర్సింహ, సత్యనారాయణ ఒంటిపాక యాదగిరి పాల్గొన్నారు.

నకిరేకల్ : తమ సమస్యల పరిష్కారం కోసం నకిరేకల్‌లో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 22వ రోజుకు చేరింది. ముసురు వర్షంలో కూడా నిరసన తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీశైలం, మండల అధ్యక్షుడు పల్స సైదులు, నాగరాజు, సోములు, అలివేలు, యశోద, యాదమ్మ, వేణు, శంకర్, ఎల్లమ్మ, లింగయ్య, వెంకటేశ్వర్లు, జానయ్య, శ్రీను, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన విద్యుత్ సరఫరా


చిట్యాల : పట్టణంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణంలో అంధకారం అలముకుంది. చిట్యాల పట్టణానికి విద్యుత్ సరఫరా అయ్యే 33 కేవీ విద్యుత్‌లైన్ బ్రేక్ డౌన్ కావడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు తెలుస్తోంది. సుమారు ఎనిమిది గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సిబ్బంది ఎలాంటి సమాచారం తెలపకుండా సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నారు. పట్టణంలో పెరిగిన విద్యుత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో తరచుగా లోఓల్టేజీ సమస్యతో ఫ్యాన్లు, టీవీలు, ఫ్రిజ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోతున్నాయి.

పెరుగుతున్న శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం

శాలిగౌరారం : మండలంతో పాటు ఎగువ ప్రాంతంలో, హైదరాబాద్‌లోనూ గత నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మూసీ నది నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చిచేరుతుంది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమక్రమంగా పెరుగుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 13 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. వానాకాలం పంటసాగు కోసం నాలుగు రోజుల క్రితం ప్రాజెక్టు నుంచి అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పరిధిలో 5వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందనుంది.

ఒంటి కాలిపై నిలబడి నిరసన

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆ గ్రామంలోని అఖిలపక్ష నాయకులు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అనుమతులు రద్దు చేసేవరకు దీక్షలు కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, మునుకుంట్ల మల్లయ్య, శేఖర్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



మునుగోడు: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పొంగిన వాగులు.. లోతట్టు ప్రాంతాలు జలమయం



నల్లగొండ టూటౌన్ : వరదను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణాచారి



కనగల్ మండలంలో కత్వ పైనుంచి పారుతున్న రేగట్టే వాగు



శాలిగౌరారంలో చెరువును తలపిస్తున్న వరి పంట భూములు



చండూరు : శిర్దేపల్లి వాగు నుంచి ప్రవహిస్తున్న నీరు



నార్కట్‌పల్లి-అమ్మనబోలు రహదారిలో అలుగు పోస్తున్న చిన్నతుమ్మలగూడెంలో చెరువు



కనగల్ : దర్వేశిపురం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న అయిలేటి వాగు

శాలిగౌరారం: మండలంలో బుధవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంలో 8.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. 15 విద్యుత్ స్తంభాలు విరిగి నేలకూలాయి. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి అడ్డగూడూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే మూడు విద్యుత్ స్తంభాలు కూలడంతో పక్కనే ఉన్న తాటిపాముల పాపరాములు ఇంటిపై విద్యుత్ తీగలు పడ్డాయి. అప్పటికే లైన్‌ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఇంట్లో నిద్రిస్తున్న వారికి ప్రాణాపాయం తప్పింది. మండలంలో రాత్రి 3 గంటల నుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధి బాలిశెట్టిగూడెంలో ఆదె సైదులుకు చెందిన రేకుల ఇంటి పైకప్పు ఎగిరిపోయింది.

జలమయమైన లోతట్టు ప్రాంతాలు

శాలిగౌరారం మండలంతోపాటూ ఎగువ ప్రాంతంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతో మండల సరిహద్దు వెంట ఉన్న మూసీ నది మూడు మీటర్ల నీటి మట్టంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శాలిగౌరారం-ఊట్కూరు గ్రామాల మధ్యన ఉన్న కాజీవే పైనుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి కాజ్‌వే వద్దకు చేరుకొని ఊట్కూరు సర్పంచ్ వేముల లింగయ్యతో కలిసి పరిస్థితిని పరిశీలించారు. కాజ్‌వే పైనుంచి ప్రయాణాలు చేయకుండా రోడ్డుకు ఇరువైపులా కంపవేసి రాకపోకలను నిలిపివేశారు.

కనగల్ : ఎగువన కురుస్తున్న వర్షాలతోపాటు కనగల్ మండల వ్యాప్తంగా కురుస్తున్న వానాలతో మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గురువారం కనగల్, రేగట్టె, శాబ్దుల్లాపురం, పగిడిమర్రి, దోరెపల్లి వాగుల్లోకి నీరు వచ్చి చేరింది. దీంతో కత్వలపై నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కనగల్ కత్వ, దర్వేశిపురం(పర్వతగిరి) ఆలయం వద్ద నిర్మించిన పుష్కరఘాట్‌పై అయిలేటి వాగు నిండుకుండలా ప్రవహిస్తోంది. వాగులు పారుతుండడంతో భూగర్భ జలాలు పెరిగి బోరు బావుల్లోకి నీరు సమృద్ధిగా చేరుతుందని రైతులు ఆనందపడుతున్నారు. చెరువు, కుంటల్లోకి మాత్రం నీరు చేరలేదు.

నార్కట్‌పల్లి : భారీ వర్షాల కారణంగా గ్రామాల్లో చెరువులు నిండి అలుగు పోస్తుండడంతో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ పులి సైదులు సూచించారు. గురువారం అమ్మనబోలు గ్రామ పంచాయతీ పరిధిలోని ఏడుమెట్లబావి చెరువు అలుగు పోస్తుండడంతో అమ్మనబోలు–శాలిగౌరారం రోడ్డుపై నీరు పారింది. అదేవిధంగా చిన్నతుమ్మలగూడెం చెరువు అలుగు పోస్తుండడంతో నార్కట్‌పల్లి–అమ్మనబోలు రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆయా ప్రదేశాలను పరిశీలించారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

నల్లగొండ టూటౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని శేషమ్మగూడెం, పాత పల్లె మధ్యలో ఉన్న కాజువేను మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో కాజువే పై వరద ఎక్కువగా వస్తోందని తెలిపారు. పైనుంచి వస్తున్న వరద సాఫీగా వెళ్లేవిధంగా జేసీబీతో చెత్తాచెదారం తొలగించామని, రెండు వైపులా బారికేడ్లను ఏర్పాటు చేస్తామని, పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. రెండు గ్రామాల రహదారిని మూసి వేశామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏసీపీ నాగిరెడ్డి, డీఈ వెంకన్న తదితరులు ఉన్నారు.

చండూరు : చండూరు, గట్టుప్పల్ మండలాల్లో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. శిర్దేపల్లి కల్వర్టుపై వరద నీరు ప్రవహిస్తోంది. చండూరు మున్సిపల్ పరిధిలోని పుల్లాయి కుంటలోకి నీరు చేరుతోంది.

మర్రిగూడలో కూలిన మిద్దె, గోడలు

మర్రిగూడ: వర్షానికి మండల కేంద్రానికి చెందిన మల్యాల లక్ష్మి ఇంటి మిద్దెతో పాటు గోడలు కూలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

గుంతల రోడ్డుపై వరినాట్లు వేసి నిరసన

శాలిగౌరారం : మండలంలోని వంగమర్తి గ్రామంలో గుంతలతో అధ్వాన్నంగా మారిన చిత్తలూరు రోడ్డుపై కాంగ్రెస్ నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ నేతృత్వంలో గురువారం వరి నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బెల్లి వీరభద్రం, గుండె కిశోర్, బూత్కూరు నర్సిరెడ్డి, సురేశ్, బాసాని నాగయ్య, ఊడుగు వెంకన్న, బెల్లి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై వరినాట్లు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

5న ఎంపీపీపై అవిశ్వాసం

మర్రిగూడ : ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై ఆగస్టు 5న అవిశ్వాస తీర్మాన సమావేశం మర్రిగూడ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు గురువారం తెలిపారు. ఆర్డీఓ ఉత్తర్వులను ఎంపీపీతోపాటు మిగతా పది మంది ఎంపీటీసీలకు అందజేసినట్లు పేర్కొన్నారు.

గొర్రెల పంపిణీ

చండూరు : మండలం పుల్లెంల గ్రామంలో 12 యూనిట్లు, చండూరులో 6 యూనిట్ల సబ్సిడీ గొర్రెలను మున్సిపల్ కౌన్సిలర్ తోకల వెంకన్న గురువారం లబ్ధిదారులకు అందించారు. బీజేపీ నాయకులు దోటి వెంకటేశ్ యాదవ్, ఏడి నాగమల్లీశ్వర్, డాక్టర్ సునిత ఉన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

నకిరేకల్ : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో వర్షాలకు నిరుపేదల ఇళ్ల కూలిపోయే దశలో ఉన్నాయని, ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం రూ.3 లక్షలు మంజురు చేయాలని టీ పీసీసీ నేత దైద రవీందర్ కోరారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున అధికారులు ముందుస్తు చర్యలు చేపట్టాలన్నారు. డ్రెయినేజీలు కూడా సరిగా లేక మురుగు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయన వెంట దేవిక, యూసఫ్, చెనగాని రాజశేఖర్, నర్సింగ్ మహేష్, జావాజీ, ప్రమోద్‌కుమార్, వంటెపాక నక్షత్, ముత్తయ్య, దైద సురేష్, సాయి, పందిరి సతీష్, గోపగాని లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

నేడు ఓపెన్ ఫోరం

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో 2011 డిసెంబర్ నుంచి 2023 మార్చి వరకు చేపట్టిన ఉపాధిహామీ పనులపై శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఏపీఓ సురేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, కూలీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సమృద్ధి కేంద్రాలతో రైతులకు మేలు

నల్లగొండ టూటౌన్ : ఎరువులు, విత్తనాలు ఒకే చోట లభించే విధంగా ప్రధానమంత్రి కృషి సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు మేలు కలుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా అన్నారు. గురువారం ప్రధాని మోదీ ప్రధానమంత్రి కృషి సమృద్ధి కేంద్రాలను ప్రజలకు అంకితం చేయగా బొట్టుగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గోలి మధుసూదన్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డి పాల్గొన్నారు.

31న మున్సిపల్ సమావేశం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 31న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ సైదిరెడ్డి అధ్యక్షతన జరుగనున్న ఈ సమావేశానికి పాలకవర్గ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.